ఉత్సాహంగా క్రీడా పోటీలు



విజయవాడ స్పోర్ట్స్: పాలిటెక్నిక్ గేమ్స్, స్పోర్ట్స్ 25వ రాష్ట్ర స్థాయి పోటీలు విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉత్సాహంగా సాగుతున్నాయి. గురువారం రెండో రోజు జరిగిన అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, చెస్, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్ టేబుల్ టెన్నిస్ పోటీల్లో ఆయా జిల్లాల జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. క్రీడా ప్రాంగణంలో సాయంత్రం నిర్వహించిన క్యాంప్‌ఫైర్‌లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. క్యాంప్ ఫైర్‌ను సాంకేతిక విద్య రాష్ట్ర సంచాలకుడు సి.నాగరాణి ప్రారంభించారు. విద్యార్థులు తరగతి గదులకే కాకుండా క్రీడల్లోనూ చురుగ్గా పాల్గొనాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు. శుక్రవారం ఈ పోటీలు ముగుస్తాయన్నారు. పోటీల్లో విజయం సాధించిన క్రీడా జట్లకు ట్రోఫీలు అందజేస్తామని, అనంతరం జాతీయ పాలిటెక్నిక్ క్రీడా పోటీలకు ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర జట్లను ఎంపిక చేస్తామన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక పోటీలు అలరించాయి. పలు కళాశాలల విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సాంకేతిక విద్య సంయుక్త సంచాలకులు పద్మారావు, సాంకేతిక విద్య బోర్డు కార్యదర్శి విజయభాస్కర్, సంయుక్త కార్యదర్శి జానకి రామయ్య, ఆర్‌జేడీలు జె.ఎస్.ఎన్.మూర్తి, నిర్మల్‌కుమార్‌ప్రియ పాల్గొన్నారు.





రోడ్డు భద్రత.. ప్రాణాలకు భరోసా

ప్రమాదాలకు అడ్డుకట్ట వేసేలా పోలీసుల చర్యలు

- విజయవాడలో 25 బ్లాక్ స్పాట్‌ల గుర్తింపు
- ట్రాఫిక్ కష్టాలు తొలగించేందుకు ప్రత్యేక కసరత్తు
- స్కూల్, కాలేజీల్లో విద్యార్థులకు ట్రాఫిక్‌పై అవగాహన
- బెంజిసర్కిల్‌లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు



నగరం హైవేలో హెల్మెట్ అవశ్యకత వివరిస్తూ వెలిసిన ఫ్లెక్సీలు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించి, ప్రమాదాలకు అడ్డుకట్ట వేసే దిశగా పోలీసులు ప్రత్యేక కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె. రాణా ఆదేశాల మేరకు ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు నగరంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. బెంజిసర్కిల్ వద్ద ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం చర్యలు తీసుకొంటున్నారు. నగరంలో తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలు గుర్తించి, అక్కడ ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు.

హెల్మెట్ లేకపోవడంతోనే..

గత ఏడాది జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 66 శాతం హెల్మెట్ ధరించకపోవటం వల్లే జరిగినట్లు పోలీసులు గుర్తించారు. దీనిని దృష్టిలో ఉంచుకొని నగరంలో ప్రతి జంక్షన్‌లో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా, పక్కన స్థానిక ఏసీపీ, సీఐ, ఎస్‌ఐల ఆధర్యంలో వాహన దారులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారు. స్కూళ్లు, కాలేజీల్లో విద్యార్థులకు, ఆటోడ్రైవర్లతో పోలీసులు ప్రత్యేకంగా మాట్లాడుతున్నారు. మీ ప్రాణం మీ చేతిలో, హెల్మెట్ భారం కాదు, ప్రాణాధారం అంటూ నగర వ్యాప్తంగా ఫ్లెక్సీలు వేశారు. రేసులు, అతివేగం, డ్రంకెన్ డ్రైవ్, సిగ్నల్ జంపింగ్స్, ట్రిపుల్ రైడింగ్, చేసే వారికి జరిమానాలు విధించడంతో పాటు, వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. లైసెన్స్, ఇన్సూరెన్స్ ఆవశ్యకతను వివరిస్తున్నారు.

ట్రాఫిక్ పై అవగాహన కల్పిస్తున్నాం..

ట్రాఫిక్ పైన ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. నగరంలో సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నాం. బెంజిసర్కిల్‌లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు తీసుకొంటున్నాం. హెల్మెట్‌పై ప్రత్యేక క్యాంపెన్ చేస్తున్నాం. స్కూళ్లు, కాలేజీలపై దృష్టి సారించి విద్యార్థులకు అవగహన కల్పిస్తున్నాం. నగరంలో ప్రధాన కూడళ్లలో అధునాతన సిగ్నలింగ్ సిస్టం, ఆటో అనౌన్స్‌మెంట్ సిస్టం ఏర్పాటు చేస్తున్నాం. ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తొలగించి, ప్రమాదాలకు అడ్డుకట్ట వేసే దిశగా చర్యలు తీసుకొంటున్నాం. ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించే వారిపైన కఠిన చర్యలు తీసుకొంటున్నాం.

– టికె.రాణా, ఎన్టీఆర్ జిల్లా, పోలీస్ కమిషనర్




హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ప్రమాదాలు జరిగే ప్రాంతాలు గుర్తించి..

నగరంలో తరచూ ప్రమాదాలు జరిగే 25 ప్రాంతాలను గుర్తించి అన్ని చోట్ల ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. అక్కడ ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన చర్యలపై పోలీస్, రవాణా, ఆర్అండ్‌బీ, నేషనల్ హైవే అథారిటీస్ అధికారులు సంయుక్తంగా పరిశీలించారు. దీంతో పాటు నగరంలో 15 కూడళ్లలో అధునాతన ట్రాఫిక్ సిగ్నలింగ్ సిస్టం ఏర్పాటు చేస్తున్నారు. పీసీఆర్, బెంజిసర్కిల్, రమేష్ ఆస్పత్రి రామవరప్పాడు, ఎనికేపాడు, నేతాజి సర్కిల్, వారధి, ఆర్టీసీ బస్టాండు, అమ్మవారి టెంపుల్, గొల్లపూడి వై జంక్షన్, స్వాతి సెంటర్లలో అనౌన్స్ మెంట్ సిస్టం అందుబాటులోకి తేస్తున్నారు. విధుల్లో పాల్గొంటున్న సిబ్బందికి రేడియం జాకెట్స్, ఎల్ఈడీ బ్యాటెన్‌లు ఇస్తున్నారు.

బెంజి సర్కిల్‌లో ట్రాఫిక్ క్రమబద్ధీకరించేలా..

బెంజిసర్కిల్‌లో వాహన దారులకు ట్రాఫిక్ కష్టాల నుంచి గట్టెక్కించేలా చర్యలు తీసుకొంటున్నారు. బెంజి సర్కిల్‌లోకి ప్రతి రోజు 1,378 ఆర్టీసీ బస్సు సర్వీసులు వస్తాయి. ఇందులో పోలీస్ కంట్రోల్ రూం నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వైపు 689 బస్సులు వెళ్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ బస్సులన్నీ బెంజిసర్కిల్‌కు 100 మీటర్లు ముందుకు వెళ్లి నిలిపేలా దిశానిర్దేశం చేశారు. అలాగే 420 ఆర్టీసీ సర్వీసులు ఏలూరు, కాకినాడ, విశాఖపట్నం వెళ్లే బస్సులను బెంజిసర్కిల్ ఫ్లై ఓవర్ మీదుగా వెళ్లాలని సూచించారు. దీంతో పాటు పోలీస్ కంట్రోల్ రూం నుంచి విమానాశ్రయానికికు వెళ్లే వాహనాలను ఎంజీ రోడ్డులోకి రాకుండా రైల్వే స్టేషన్, బీఆర్‌టీస్ రోడ్డు, రామవరప్పాడు మీదుగా వెళ్లేలా, పోలీస్ కంట్రోల్ రూం వద్ద సూచిక బోర్డు ఏర్పాటు చేశారు. హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాలు సైతం గొల్లపూడి, ఎట్కిన్‌సన్ స్కూల్, కబేళా, సీవీఆర్ ఫ్లై ఓవర్, పైపుల రోడ్డు, కండ్రిగ, రామవరప్పాడు మీదుగా విమానాశ్రయం వెళ్లే విధంగా గొల్లపూడిలో సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రధానంగా ట్రాఫిక్ రద్దీ ఉదయం 9నుంచి11 గంటల వరకు సాయంత్రం 5నుంచి 8 గంటల వరకు వాహనాలన్నీ ఎంజీ రోడ్డు వైపే రాకుండా, ఆ సమయాల్లో వివిధ మార్గాల్లో ఏలూరు రోడ్డుకు వెళ్లాలని ప్రయాణికులకు సూచిస్తున్నారు. రామవరప్పాడు జంక్షన్‌లో ట్రాఫిక్ కష్టాలు తొలగేలా చర్యలు తీసుకొంటున్నారు.



నగరంలో ఏర్పాటు చేసిన సూచిక బోర్డులు

ఫోన్ ట్యాపింగ్ ఆరోపణ నిరాధారం

పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తన ఫోన్ ట్యాపింగ్ చేశారని చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమని కృష్ణాజిల్లా పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ఖండించారు. ఆయన గురువారం మండలంలోని చోడవరంలో విలేకరులతో మాట్లాడారు. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వైఎస్సార్ సీపీ శాసనసభ్యుడిగా ఉండి 2024లో టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని చెప్పటం ఎంతవరకు సబబని, పార్టీ మారాలనే ఉద్దేశంతో, ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని ఆరోపించారు.

















క్లుప్తంగా

అమరా కుటుంబానికి తగిన న్యాయం చేస్తాం

జిల్లా కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: ఇటీవల ఆత్మహత్య చేసుకున్న అమరా ఇంజినీరింగ్ కళాశాల అధినేత వెంకటేశ్వరరావు కుటుంబానికి తగిన న్యాయం చేస్తామని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. గురువారం సాయంత్రం అమరా వెంకటేశ్వరరావు భార్య సుధారాణి, వారి కుమారుడు, కుమార్తెతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్‌ను కలిశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ అమరా కుటుంబానికి వైఎస్సార్ సీపీ మద్దతుగా ఉంటుందన్నారు. అమరా భార్య సుధారాణి మాట్లాడుతూ తమ సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లటంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి చేసిన సహాయానికి ఆమె తన కృతజ్ఞతలు తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాదు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నిరుద్యోగ యవతకు ఉచిత శిక్షణా తరగతులు నిర్వహించనున్నామని స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి షేక్ జాజీబాబు గురువారం తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రతి నియోజక వర్గంలో స్కిల్ హబ్ ఏర్పాటు చేసి, అందులో నిరుద్యోగ యవతకు ఉచిత శిక్షణా అందిస్తున్నామన్నారు. అందులో భాగంగానే గురజాల నియోజక వర్గంలో పిడుగురాళ్ల పట్టణంలో ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తునున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 70139 50097 నెంబర్‌లో సంప్రదించాని బాజీ బాబు పేర్కొన్నారు.

మందులు వితరణ

చిలకలూరిపేట టౌన్: రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆరోగ్య కేంద్రానికి రూ.40 వేలు విలువ చేసే మందులను క్లబ్ సభ్యుడు పి. శ్రీనివాసరావు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ ట్రెజరర్ గోగినేని నాగేశ్వరరావు మాట్లాడుతూ క్లబ్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా పేదలకు ఉచితంగా క్లబ్ ద్వారా పంపిణీ చేసే మందులు క్లబ్ సభ్యుడు అందజేయటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ గిరికుమార్, పి.సింగారావు, కె.సాంబశివరావు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో స్టీరింగ్ కమిటీ పర్యటన

యడ్లపాడు: నియోజవర్గంలో టీడీపీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుల బృందం గురువారం పర్యటించింది. యడ్లపాడు, బొప్పూడి గ్రామాల్లోని మిరప కల్లాలను, అలాగే నల్ల తామర తెగులుతో నష్టపోయిన మిరప పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గతమూడేళ్లుగా మిరపపంటలో నల్లతామర సోకి గణనీయంగా దిగుబడులు తగ్గి తీవ్ర నష్టాన్ని కలుగజేసిందన్నారు. ప్రత్తిపంటలో గులాబీ పురుగు, మొక్కజొన్నలో కత్తెర పురుగులు దాడి చేస్తున్నట్లు పర్యటలో గుర్తించామన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అరవింద.. గురివింద సామెత ఎరుగవా..?

- నీ చేతగానితనం వల్లే సమస్యలు
- అంతర్గత పోరును పరిష్కరించుకోలేకే నీకీ తిప్పలు
- టీడీపీ నేత అరవిందబాబుపై మండిపడ్డ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి


మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు గురివింద సామెత వలే తన తప్పులు కప్పిపెడుతూ, ఎదుటివారిపై నిందలు వేసే పద్ధతిని పాటిస్తున్నారని, తన పార్టీలోని నాయకుల మధ్య ఏర్పడిన వివాదాలను పరిష్కరించటం చేతగాకపోవడం వల్లే మండలాధ్యక్షుడు వెన్నా బాల కోటిరెడ్డిపై రెండోసారి హత్యాయత్నం చోటుచేసుకుందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ టీడీపీ నాయకుల ఆరోపణల్లో ఏమాత్రం నిజంలేదని, ఈ పదేళ్ల రాజకీయ జీవితంలో తానెప్పుడూ హత్యా రాజకీయాలను ప్రోత్సహించలేదన్నారు. ఇది కేవలం టీడీపీలోని అంతర్గత పోరులో భాగంగానే రెండోసారి జరిగిందన్నారు. అప్పుడు కూడా పమ్మి వెంకటేశ్వర రెడ్డిని అరెస్టు చేశారన్నారు. బాలకోటిరెడ్డి, వెంకటేశ్వర రెడ్డిల మధ్యనున్న ఆధిపత్య పోరే ఇందుకు కారణమని, ఇదిపూర్తిగా టీడీపీ నాయకుడి వైఫల్యమన్నారు. ఏదైనా సంఘటన జరిగితే ఇరువర్గాలను కూర్చోబెట్టి, మాట్లాడి వివాదాలను సర్దుబాటు చేయాల్సి ఉండగా అవేమి చేయకపోవటం వల్లే మరోసారి హత్యాయత్నం జరిగిందన్నారు. వారి చేతగానితనాన్ని తమపై రుద్దుతున్నారన్నారు. పమ్మి వెంకటేశ్వరరెడ్డికి తమ పార్టీకి ఎటువంటి సంబంధం లేదని, కాల్‌డేటా పరిశీలించాలని, తమ పార్టీ వారు ఎవరైనా ఉండి ఉంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎటువంటి ఆధారాలు చూపించకుండా ఆరోపణలు చేయటం సముచితం కాదన్నారు. వృద్ధుడైన బాలకోటిరెడ్డిని తప్పించి తనకు నాయకత్వం ఇవ్వాలని వెంకటేశ్వరరెడ్డి కోరుతుండగా ఎందుకు ఆ సమస్యను పరిష్కరించటం లేదని ఎమ్మెల్యే గోపిరెడ్డి ప్రశ్నించారు. ఈ ప్రాంతంలో గన్ కల్చర్‌ను తాను తీవ్రంగా ఖండిస్తున్నాననీ, దీనిని ఎప్పుడూ ప్రోత్సహించ లేదన్నారు. శాంతియుతంగా అందరూ జీవించాలన్నదే తన ధ్యేయమన్నారు. గన్‌కల్చర్‌ను సమూలంగా తుడిచిపెట్టాలని జిల్లా ఎస్పీకి తాను సూచించినట్లు చెప్పారు. దీనికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఓపెన్ స్కూల్ పరీక్షల షెడ్యూల్ విడుదల

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే పదవ తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల షెడ్యూల్‌ను ఓపెన్ స్కూల్ విద్యాపీఠం సంచాలకులు డాక్టర్ కె.వి.శ్రీనివాసులు విడుదల చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటప్పయ్య గురువారం తెలిపారు. ఓపెన్ స్కూల్ పరీక్షలు ఏప్రిల్ 3వతేదీ నుంచి 17 వరకు కొనసాగుతాయని తెలిపారు. పదవ తరగతి పరీక్షకు ఒక్కో సబ్జెక్టుకు రూ.100, ఇంటర్మీడియెట్ పరీక్షకు థియరీ ఒక సబ్జెక్టుకు రూ.150, ప్రాక్టికల్ పరీక్షకు రూ.100 చెల్లించాలని తెలిపారు. అలాగే సప్లిమెంటరీ విద్యార్థులు ఇంటర్మీడియెట్ థియరీ ఒక సబ్జెక్టుకు రూ.250, ప్రాక్టికల్‌కు రూ.100 పరీక్ష ఫీజు చెల్లించాలని తెలిపారు. ఇంప్రూవ్‌మెంట్ విద్యార్థులు ఇంటర్మీడియెట్ థియరీ పరీక్షకు రూ.250, ప్రాక్టికల్‌కు రూ100, ఒక్కో సబ్జెక్టుకు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

కాగా, పరీక్ష ఫీజులను ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈనెల 15వతేదీ వరకు, రూ.25 అపరాధ రుసుంతో ఈనెల 22వతేది వరకు, రూ.50 అపరాధ రుసుంతో మార్చి నెల 2వతేదీ వరకు చెల్లించవచ్చని వివరించారు. వివరాలకు సమీపంలోని స్టడీ సెంటర్ల కో–ఆర్డినేటర్లను, ఓపెన్ స్కూల్ జిల్లా కార్యాలయంలోని సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు.

బాలల పరిరక్షణ కమిటీలను బలోపేతం చేయండి

సమీక్షలో జిల్లా కలెక్టర్ శివశంకర్


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శివశంకర్, బత్తుల పద్మావతి

నరసరావుపేట: జిల్లాలో బాలల పరిరక్షణ కమిటీలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ పేర్కొన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతితో కలిసి మోడల్ స్కూళ్లు, గురుకుల పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి సెలవులలో బాలబాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించే చర్యలు చేపట్టాలన్నారు.

బాలికలలో తమ సమస్యల పరిష్కారానికి వారిలో వారు చర్చించుకుని తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయుల దృష్టికి తీసుకొచ్చి సమస్యలను సున్నితంగా పరిష్కరించాలన్నారు. గ్రామాలలో బాల్య వివాహాలను నిరోధించేందుకు గ్రామ కమిటీలను బలోపేతం చేస్తూ గ్రామ సచివాలయాల్లోని మహిళా పోలీసుల సేవలను వినియోగించుకోవాలని ఆయన సూచించారు. పదవ తరగతి పాస్ అయిన తదుపరి ఆర్థిక స్తోమత దృష్ట్యా పై చదువులకు వెళ్లలేని పిల్లలను గుర్తించి వారికి పై చదువులకు అవకాశం కల్పించేలా చర్యలు చేపట్టి, డ్రాప్ అవుట్ శాతాన్ని తగ్గించాలన్నారు. గురుకుల, మోడల్ పాఠశాలలలో భవన పరిస్థితులు, విద్యుత్ సంబంధిత కనెక్షన్ల పరిస్థితులను ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి సమస్యలను పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా పొలాల మధ్య ఉన్న పాఠశాలలలో పాములు రాకుండా జాగ్రత్త వహించాలని, చుట్టుపక్కల గుబురుగా చెట్లు ఉండకుండా చూడాలని, అలాగే ట్రాన్స్‌ఫార్మర్లు దూరంగా ఉంచేలా చూడాలన్నారు. గురుకుల, మోడల్ హైస్కూళ్ల పరిధిలో తాగునీటి వసతికి సంబంధించి అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాలని ఆదేశించారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యురాలు పద్మావతి మాట్లాడుతూ అసాధారణంగా ప్రవర్తించే విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రుల దృష్టికి తీసుకుని వెళ్లి మానసిక వైద్యులతో చికిత్స చేయించాలన్నారు.

అనంతరం బాలల హక్కుల పరిరక్షణకు సంబంధించి తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఐసీడీఎస్ పీడీ అరుణ, జీసీడీఓ రేవతి, సీడీపీఓ ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక ఒడిలో.. పుస్తకాల గుడి

నేడు లంకా సూర్యనారాయణకు విశిష్ట సేవా పురస్కారం ప్రదానం

సిసలైన పుస్తక నేస్తం లంకా

- యాభై ఏళ్లలో లక్షకు పైగా గ్రంథాల సేకరణ
- వేంకటేశ్వరస్వామి ఆలయానికి దత్తం
- అన్నమయ్య గ్రంథాలయంగా విజ్ఞాన వెలుగుల ప్రసారం

తెనాలి: పుస్తకంతో ఆయనకు సిసలైన స్నేహం కుదిరింది. అరుదైన గ్రంథాలను సేకరించడం ప్రవృత్తిగా మారింది. అయిదు దశాబ్దాల కృషితో సమకూరిన 1.35 లక్షల పుస్తకాలతో ఏకంగా గ్రంథాలయమే నడుస్తోంది. చదువరులకు జ్ఞానతృష్ణ తీరుస్తోంది. పరిశోధకులకు అపురూప నిధి. మరెన్నో పుస్తకాలు వెలుగులోకి వచ్చేందుకు తోడ్పడుతోంది. జ్ఞానసంపద వెలుగుకు రక్షరేఖగా నిలిచిన ఆ గ్రంథాలయ కాపరి లంకా సూర్యనారాయణ. బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 6 గంటలకు గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని అన్నమయ్య కళావేదికపై జరిగే ప్రత్యేక సభలో ఆయనకు విశిష్ట సేవా పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. ముస్సోరిలోని లాల్‌బహదూర్ శాస్త్రి అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌లా ప్రొఫెసర్ ఆరేటి కృష్ణకుమారి, ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ అతిథులు.



అన్నమయ్య ఆధ్యాత్మిక గ్రంథాలయం

రచయితలు, కవుల సాంగత్యంతో అక్షరాలపై ఆపేక్ష..

లంకా సూర్యనారాయణ స్వస్థలం గుంటూరు దగ్గర్లోని పెదగొట్టిపాడు. 1936లో జన్మించారు. హిందూ కాలేజీలో ఇంటర్, ఏసీ కాలేజీలో బీఎస్సీ, తర్వాత బీఏ చేశారు. 1956లో సెంట్రల్ ఎక్సైజ్ సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా వృత్తి జీవితాన్ని ఆరంభించారు. హైదరాబాద్‌తో సహా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని పలుచోట్ల పనిచేసి, 1992లో గుంటూరులో సూపరింటెండెంట్ హోదాలో ఉద్యోగ విరమణ చేశారు. అదే నగరంలో స్థిరపడ్డారు. 1971 ప్రాంతంలో ఉద్యోగరీత్యా ఏలూరులో ఉన్నప్పుడు రచయితలు, కవులతో సాంగత్యం అక్షరాలపై అపేక్షను పెంచింది. పుస్తకాలను కొనడం, చదవడం, చదివించడం వ్యాపకమైంది. ఉద్యోగ విరమణతో అదే లోకమైంది. గత అయిదు దశాబ్దాలకు పైగా పుస్తకాలను కొనడం, సేకరించటం, భద్రపరుస్తూ వచ్చారు.

వేంకటేశ్వరస్వామికి పుస్తక భాండాగారం అంకితం

మిత్రులు గుమ్మడి రాధాకృష్ణమూర్తి, లక్ష్మీనరసయ్య, శ్రీహరిరావు మరికొందరితో కలిసి గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లో శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని నిర్మించారు. తన పుస్తక భాండాగారాన్ని స్వామివారికి సమర్పించారు సూర్యనారాయణ. స్వామివార్ల ప్రతిష్ఠ 1999లో జరగ్గా, సూర్యనారాయణ అందించిన లక్షా 35 వేల పుస్తకాలతో అక్కడ అన్నమయ్య గ్రంథాలయం, ఎందరో చదువరులకు యాత్రాస్థలంగా మారింది. పొత్తూరి వెంకటేశ్వరరావు, వీఏకే రంగారావు, సి.సుబ్బారావు, మేడసాని మోహన్, గొల్లపూడి మారుతీరావు, తనికెళ్ల భరణి, జస్టిస్ జాస్తి చలమేశ్వర్, శ్రీరమణ వంటి ప్రముఖులు ఎందరో సందర్శించారు.


పుస్తకంతో లంకా సూర్యనారాయణ

అద్భుత పుస్తకాల సమాహారం

ప్రాచీన, అధునాతన కావ్యాలు, పురాణాలు, శాస్త్రాలు, లక్షణ గ్రంథాలు, ఆయుర్వేద గ్రంథాలు, చిత్రకళా గ్రంథాలు, విమర్శనా గ్రంథాలు, అవధానం, జ్యోతిష్యం, వాస్తు, వ్యాకరణ శాస్త్రాలు, పీహెచ్‌డీ థీసిస్‌లు.. ఒకటనేమిటి? వివిధ రంగాలకు చెందిన వాఙ్మయమంతా ఇక్కడ నిక్షిప్తమై ఉందని అందరూ అంగీకరించారు. 880 భగవద్గీతలు, 774 భాగవతాలు, 1634 రామాయణాలు, 681 భారతిలు, 2,975పైగా స్వీయచరిత్రలు/జీవిత కథలు, 2000 శతకాలు, 1500 నాటకాలు, వెయ్యి సంగీత గ్రంథాలు, 150 సంవత్సరాల పంచాంగాలు, వెయ్యి నిఘంటువులు సహా ఉత్తమ జాతి పత్రికలెన్నో ఇక్కడ కొలువుదీరాయి. దిన, వార, మాసపత్రికల్లో వచ్చిన లలితకళా సంబంధ వ్యాసాల కత్తిరింపులు దాదాపుగా నాలుగు లక్షల వరకు ఉన్నాయి. అక్కడకు వచ్చినవారికే కాదు.. డిజిటలైజేషన్ చేసిన పుస్తకాల క్యాటలాగ్‌ను ఆన్‌లైన్‌లో చూసుకుని, ఏదైనా పుస్తకం కావాలని ఫోన్ చేసినవారికి పీడీఎఫ్ కాపీ పంపుతున్నారు. పత్రికల క్లిప్పింగులు కూడా స్కాన్ చేసి అందుబాటులో ఉంచగలిగితే తెలుగు భాషకు ఎంతో మేలు చేసినట్టవుతుంది.

మహిళల మనోధైర్యం ఎంతో గొప్పది


సైక్లిస్ట్ ఆశ మాల్వియాతో కలెక్టర్, ఎమ్మెల్సీలు ఉమ్మారెడ్డి, డొక్కా, ఎమ్మెల్యే రోశయ్య

గుంటూరు వెస్ట్: మహిళల మనోధైర్యం ఎంతో గొప్పదని, వారు అనుకున్నదాన్ని సాధిస్తారని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఆల్ ఇండియా సైకిల్ టూరిస్ట్ ఆశ మాల్వియా గురువారం గుంటూరుకు వచ్చిన సందర్భంగా ఆమెను కలెక్టర్ బంగ్లాలో కలెక్టర్‌తో పాటు శాసనమండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ప్రభుత్వ విప్ డొక్కా మాణిక్యవర ప్రసాద్, పొన్నూరు శాసన సభ్యుడు కిలారి వెంకట రోశయ్య, స్టెప్ సీఈఓ పల్లవి ఘనంగా సత్కరించారు.

ఇక్కడి ప్రజలు స్నేహశీలురు..

ఆశ మాల్వియా మాట్లాడుతూ తాను మధ్యప్రదేశ్‌లోని రాజ్‌ఘర్ ప్రాంతానికి చెందిన వ్యక్తినని చెప్పారు. నేషనల్ ప్లేయర్ మౌంటెనీరింగ్‌గా పనిచేస్తున్నానన్నారు. ఈ రంగంలో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్ కూడా సాధించానని తెలిపారు. గత ఏడాది నవంబర్ 1న ప్రారంభమైన తన సైకిల్ యాత్ర ఇప్పటివరకు 7 రాష్ట్రాల్లో సాగిందని వివరించారు. ఇప్పటి వరకు 9,000 కి.మీ. ప్రయాణించానని ఈ ఏడాది ఆగస్ట్ 15 నాటికి ఢిల్లీ చేరుకుంటానని చెప్పారు. ఏపీ ప్రజలు స్నేహశీలులన్నారు.

ఐజీ అభినందనలు

నగరంపాలెం: సైకిల్ యాత్ర చేస్తున్న ఆశ మాల్వియాను గురువారం గుంటూరు రేంజ్ ఐజీ డాక్టర్ సీఎం త్రివిక్రమవర్మ అభినందించారు. ఈ యాత్రలో భాగంగా గుంటూరు నగరానికి విచ్చేసిన ఆశమాల్వియాకు తన కార్యాలయంలో ఐజీ పుష్పగుచ్ఛం అందజేశారు.

సీమ పందులతో సిరుల పంట

- నిరుద్యోగులకు స్ఫూర్తినిస్తున్న ముక్త్యాల ఫారం
- మార్కెటింగ్ చేసుకుంటే అధికంగా లాభాలు


ముక్త్యాల సీమ పందుల పెంపక కేంద్రం

జగ్గయ్యపేట అర్బన్: సీమ పందుల పెంపకం నేడు నిరుద్యోగుల పాలిట వరంగా మారింది. స్వయం ఉపాధి పొందటానికి ఎంతో అనువుగా ఉన్న పెంపకం నేడు వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఆహారంలో మాంసకృత్తుల లోపాన్ని నివారించటంలో బ్రాయిలర్ కోళ్ల తరువాత స్థానం సీమపందుల మాంసానిదే. పాతకాలంలో ఈ వ్యాపారాన్ని అసహ్యించుకున్న వారు సైతం నేడు వాటిని పెంచటం కోసం రుణ సహాయానికి బ్యాంకులు, ప్రభుత్వ మండల అభివృద్ధి అధికారులు, పశు వైద్యశాలల చుట్టూ తిరుగుతున్నారు. మేలురకం జాతి సీమ పందులు మార్కెట్‌లోకి వచ్చిన తరువాత వీటి మాంసానికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఏర్పడింది.

ఏడు దశాబ్దాల చరిత్ర గల ముక్త్యాల సీమ పందుల పెంపక కేంద్రం

రాష్ట్రంలో ముక్త్యాలతో పాటు పశ్చిమ గోదావరి జిల్లా గోపన్నపాలెం, విజయనగరం జిల్లాలో మాత్రమే ప్రభుత్వ సీమపందుల కేంద్రాలు ఉన్నాయి. వాటిలో ముక్త్యాల ఫాం పెద్దది. తెలంగాణలో ఎక్కడా లేవు. 75 ఏళ్ల క్రితం ముక్త్యాల రాజావారు వీఆర్‌జీకేఎం ప్రసాద్ వితరణతో 20 ఎకరాల సువిశాల స్థలంలో జగ్గయ్యపేట సమీపంలోని ముక్త్యాల గ్రామంలో ఈ ఫాం ఏర్పాటుచేశారు. దీనిలో అమెరికా, ఆస్ట్రేలియా, జర్మనీ, కేరళ జాతులతో పాటు లార్జ్ వైట్ యార్క్ షైర్ పందులను మాత్రమే పెంచుతారు.

తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం

ఈతకు 9, 10 పిల్లలను పొందుతూ ప్రతి ఈత తరువాత అధిక లాభాలను పొందవచ్చు. 90 కిలోల వరకు అతి త్వరగా పెరుగుతాయి. ప్రతి 3–4 కిలోల దాణాతో కిలో బరువు పెరుగుతూ తక్కువ వ్యవధిలో మాంసంగా మార్చగలిగే శక్తి ఉన్న పెంపుడు జీవి ఇది. నిరుద్యోగులు సుమారు రూ.2 లక్షల పెట్టుబడితో రెండు, మూడు గదులతో రేకుల షెడ్ ఏర్పాటుచేసుకోవాలి. ప్రభుత్వ ఫారాలలో పెద్ద పందుల అమ్మకాలు ఉండవు. రెండు నెలల పిల్లలను ఒక్కొక్కటి రూ.1900 చొప్పున అమ్ముతారు. 4, 5 నెలల్లో 50 కిలోల బరువు దాటుతుంది. మార్కెట్‌లో కిలో మాంసం రూ.300, వారు (స్కిన్) కిలో రూ.400 ఉంటుంది. 50 కిలోల పందిని రూ.15 వేలకు అమ్ముకోవచ్చు.

ముఖ్యమైన జాతుల ఎంపిక

వీటి జాతుల్లో దేశవాళీ, విదేశీ జాతులు ఉన్నప్పటికీ వాటి ఎంపికలో జాగ్రత్తలు పాటించాలి. సమాన దూరంలో 12–14 చనులు ఉన్న జాతి లక్షణాలు ఉన్న ఆడ పందులను ఎంచుకోవాలి. సంతానోత్పత్తికి తొలిచూలు ఆడపందుల ఎంపికను 90 కిలోల బరువు ఉన్న దానిని ఎంచుకోవాలి. వ్యాధులు లేని వాటిని కొనుగోలు చేయాలి.

పోషణ, ఆహారం

పోషణ ఖర్చులో 80 శాతం వరకు వాటి దాణాకే వెచ్చించాలి. శాస్త్రపరంగా ఫాంలో ధాన్యపు గింజలు, వేరుశనగ, తవుడు, విటమిన్, మినరల్స్, సోయా బీన్స్, అమినో ఆసిడ్ కలిపి తయారుచేస్తారు. ఎక్కువ ఖర్చు అవుతుందనుకుంటే హోటళ్లు, హాస్టళ్లలో సేకరించిన వృథా ఆహార పదార్థాలను వాడవచ్చు. లేదా మొక్కజొన్నలు, సజ్జలు మిశ్రమం చేసి ఆహారంగా వాడవచ్చు. ఇంకా తక్కువ ఖర్చుతో పెంచాలంటే నూకలు, తవుడులో మొక్కజొన్న పిండిని కలిపి వాడవచ్చు. హాస్టళ్ల వంటి వాటి నుంచి సేకరించిన, నిల్వ ఉన్న ఆహారపదార్థాలలో వైరస్ ఉంటున్నందున దానిని ఉడికించి చల్లార్చిన తరువాత పెట్టడం ఉత్తమమని శాస్త్రవేత్తలు అంటున్నారు.


ఫారం లోని పందులు

తిరునాళ్లలో రెచ్చిపోయిన బ్లేడ్ బ్యాచ్

ఉయ్యూరు(పెనమలూరు): తిరునాళ్లలో బ్లేడ్ బ్యాచ్ రెచ్చిపోయింది. అమ్మవారి ఆలయం సమీపంలో బుధవారం రాత్రి కొందరు యువకులు హల్‌చల్ చేశారు. వీరి ఆగడాలను అడ్డుకోబోయిన ఓ యువకుడిపై బ్లేడ్ బ్యాచ్ దాడి చేసి గాయపరిచారు. ఏడుగురు యువకుల బ్యాచ్ బ్లేళ్లు తీసి అడ్డుకున్న స్థానికులపై దాడికి తెగబడ్డారు. ఈ దాడిలో దుర్గాప్రసాద్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. దాడికి పాల్పడ్డ ఇరువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. తిరునాళ్ల ప్రారంభం రోజున ఎగినపాడు ప్రాంతం వద్ద బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు వృద్ధురాలి మెడలోని నానుతాడును తెంచుకుని పోయారు. ఈ ఘటనపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందింది. మొక్కు చెల్లించేందుకు వచ్చిన తాడంకి వాసి కూచిపూడి రాంబాబు యాక్టివా చోరీకి గురైంది. తాళం వేసి ఉన్న యాక్టివాను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకు పోయినట్లు సీసీ కెమెరాలో నమోదైంది.

లిఫ్ట్‌లను పరిశీలించిన డీఆర్‌ఎం

- తక్షణమే మరమ్మతులు చేయించాలని ఆదేశం
- గుంటూరు రైల్వే స్టేషన్‌లో వేగంగా అభివృద్ధి పనులు
- డీఆర్‌ఎం రామకృష్ణ

సాక్షి ఎఫెక్ట్


నూతన ప్లాట్‌ఫామ్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డీఆర్‌ఎం రామకృష్ణ, పక్కన ఏడీఆర్‌ఎం శ్రీనివాస్

లక్ష్మీపురం(గుంటూరు): గుంటూరు రైల్వే స్టేషన్‌లో నెల రోజులుగా 1వ నంబర్ ప్లాట్‌ఫారం పైగల రెండు లిఫ్ట్‌లు, ఎస్కలేటర్ పనిచేయకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బుధవారం పనిచేయని లిఫ్ట్‌లు, ఎస్కలేటర్లు అన్న శీర్షికతో ప్రచురితమైన కథనానికి గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్‌ఎం రామకృష్ణ స్పందించారు. గురువారం డీఆర్‌ఎం రామకృష్ణ, ఏడీఆర్‌ఎం శ్రీనివాస్, సంబంధిత ఎలక్ట్రికల్ విభాగాధిపతులతో కలిసి రైల్వే స్టేషన్‌లోని 1వ నంబర్ ప్లాట్‌ఫారంపై లిఫ్ట్‌లు, ఎస్కలేటర్లను పరిశీలించారు. తక్షణమే ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం రామకృష్ణ మాట్లాడుతూ లిఫ్ట్‌లకు తక్షణమే మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. ఎస్కలేటర్లను వినియోగించే సమయంలో ప్రయాణికులు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. కొంతమంది ఎస్కలేటర్‌ను నిలిపివేసి సెల్ఫీలు దిగడం చేస్తున్నారని, అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైల్వే స్టేషన్‌లోని 1వ నంబర్ ప్లాట్‌ఫారంపై ప్రయాణికుల సౌకర్యార్థం మరో ఎస్కలేటర్ కోసం పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. గుంటూరు రైల్వే స్టేషన్‌లో ప్రస్తుతం 7 లిఫ్ట్‌లు, 5 ఎస్కలేటర్లు ఉన్నాయని తెలిపారు. ఈ ఏడాది మార్చి నెలాఖరులోగా 1వ నంబర్ ప్లాట్‌ఫారంపై మరో ఎస్కలేటర్‌ను సిద్ధం చేస్తామని స్పష్టం చేశారు. 8వ ప్లాట్‌ఫారం వైపు సబ్‌వేలో కూడా 1 లిఫ్ట్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అమృత భారత్ స్టేషన్ స్కీమ్‌లో భాగంగా గుంటూరు రైల్వే స్టేషన్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. గుంటూరు రైల్వే స్టేషన్‌లోని పశ్చిమ పరిధిలోని నూతన ప్లాట్‌ఫారాన్ని అన్ని హంగులతో రూపొందించేందుకు శరవేగంగా పనులు జరుగుతున్నాయని చెప్పారు. అనంతరం రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులను పరిశీలించారు.

వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్స్ తూ.గో జిల్లా

- అండర్–17 బాలురు, బాలికలు, అండర్–19 బాలికల విజేతలు వారే
- అండర్–19 బాలుర విన్నర్స్‌గా కర్నూలు


వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో విజేతలు

జగ్గయ్యపేట అర్బన్: గత నెల 30 వ తేదీ నుంచి ఫిబ్రవరి 1 వ తేదీ వరకు ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలోని ఉక్కు కళావేదికలో జరిగిన 66 వ ఏపీ స్టేట్ స్కూల్ గేమ్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్–2023 పోటీలు బుధవారం రాత్రితో ముగిశాయి. గురువారం విజేతలకు బహుమతి ప్రదానం జరిగింది. ఈ పోటీలను ఎన్టీఆర్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, చిల్లకల్లు జిల్లా పరిషత్ హైస్కూల్ వారు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. పోటీలకు సంబంధించి అండర్–17 బాలబాలికలు, అండర్–19 బాలబాలికలు ఆయా కేటగిరిలలో 270 నుంచి 290 మంది పోటీ పడగా, 40 మంది రిఫరీలు పాల్గొని పోటీలను చక్కగా నిర్వహించినట్లు టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గంటా వెంకటేశ్వర్లు తెలిపారు. బహుమతి ప్రదానోత్సవంలో జగ్గయ్యపేట మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, ఎన్టీఆర్ జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ ఆర్.సీజర్‌రెడ్డి, వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ సెక్రటరీ దామోదర్ ముఖ్య అతిథులుగా పాల్గొని బహుమతులు అందజేశారు. కమిటీ సభ్యులు కామినేని రమేష్, జిల్లేపల్లి సుధానంద్, వెయిట్ లిఫ్టింగ్ కోచ్‌లు రమేష్, సతీష్, ఎం.శ్రీనివాసరావు, గురునాథం, సరోజ పాల్గొన్నారు.


విజేతల వివరాలు...

- అండర్–17 బాలికల విభాగంలో బెస్ట్ లిఫ్టర్ కె.తరంగిణి(తూర్పుగోదావరి జిల్లా)
- అండర్–17 బాలుర విభాగంలో కూర్మనాథ్(కడప జిల్లా)
- అండర్–19 బాలుర విభాగంలో ఎ.అరుణేష్‌బాబు(పశ్చిమ గోదావరి జిల్లా)
- అండర్–19 బాలికల విభాగంలో ఎ.రేవతి(విశాఖ జిల్లా).

టీమ్ చాంపియన్‌షిప్స్ వివరాలు

- అండర్–17 బాలికల విన్నర్స్ తూర్పుగోదావరి జిల్లా
- అండర్–17 బాలికల రన్నర్స్ వైఎస్సార్ కడప జిల్లా
- అండర్–17 బాలుర విన్నర్స్ తూర్పు గోదావరి
- అండర్–17 బాలుర రన్నర్స్ వైఎస్సార్ కడప జిల్లా
- అండర్–19 బాలికల విన్నర్స్ తూర్పు గోదావరి జిల్లా
- అండర్–19 బాలికల రన్నర్స్ ప్రకాశం జిల్లా
- అండర్–19 బాలుర విన్నర్స్ కర్నూలు జిల్లా
- అండర్–19 బాలుర రన్నర్స్‌గా తూర్పుగోదావరి జిల్లా

సాక్షి పల్నాడు
శుక్రవారం । 3 । ఫిబ్రవరి । 2023



పులిచింతల నీటి నిల్వ


అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 41.7333 టీఎంసీలు. ప్రాజెక్టు ఎగువ నుంచి 4,485 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. దిగువకు 2,200 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్: కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద 2,212 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. కొమ్మమూరు కాలువకు 1,376 క్యూసెక్కులు విడుదలయ్యాయి.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా సోమవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.


న్యూస్‌రీల్

30 రోజుల టెన్త్ కార్యాచరణ సిద్ధం

జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థుల కోసం రివిజన్, స్లిప్ టెస్టులను నిర్వహించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ గురువారం తెలిపారు. ఏప్రిల్ 3వ తేదీ నుంచి జరగన్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు ఎఫ్ఏ-3, 4, ప్రీ-ఫైనల్ పరీక్షల తేదీలు మినహా ఏప్రిల్ 2వ తేదీ వరకు తెలుగు, ఆంగ్ల మాధ్యమాల వారీగా అన్ని సబ్జెక్టులకు తయారు చేసిన 30 రోజుల కార్యాచరణ ప్రణాళికను డీఈవోజీఎన్‌టీ.బ్లాగ్‌స్పాట్.కామ్‌లో ఉంచినట్లు పేర్కొన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఉప విద్యాశాఖాధికారులు, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు ఆయా సబ్జెక్టులు, తేదీల వారీగా 10వ తరగతి విద్యార్థుల కోసం రూపొందించిన ప్రణాళికలు అమలుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 566.10 అడుగుల వద్ద ఉంది. ఇది 246.7898 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకు 9,700, ఎడమ కాలువకు 8,280, ప్రధాన జల విద్యుత్ కేంద్రానికి 8,550, ఎస్ఎల్‌బీసీకి 1,800, వరద కాలువకు 320 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 28,650 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి వచ్చే నీరు పూర్తిగా నిలిచిపోయింది. శ్రీశైలం జలాశయం నీటి మట్టం 838.30 అడుగుల వద్ద ఉంది. ఇది 59.3974 టీఎంసీలకు సమానం.

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2,000, గరిష్ట ధర రూ.2,900, మోడల్ ధర రూ.2.400 వరకు పలికింది.

సూత్రధారి సమీప బంధువే

- టీడీపీ నేత బాలకోటిరెడ్డిపై రెండోసారి హత్యాయత్నం
- కాల్పుల ఘటనలో నలుగురి అరెస్ట్
- గంటల వ్యవధిలో కేసును ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రవిశంకర్‌రెడ్డి



తుపాకి కాల్పుల్లో గాయపడిన బాలకోటిరెడ్డి



కాల్పులు జరిపిన తుపాకీని చూపిస్తున్న జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట: రొంపిచర్ల మండలం అలవాల గ్రామంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడిపై కాల్పుల ఘటనలో నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి వెల్లడించారు. గ్రామంలో ఆధిపత్య పోరు టీడీపీ మండల అధ్యక్షుడు వెన్నా బాలకోటిరెడ్డిపై రెండోసారి హత్యాయత్నానికి దారి తీసిందని ఎస్పీ పేర్కొన్నారు. ఈ సంఘటనలో కాల్పులు జరిపిన తుపాకీని కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వెంటనే కేసు నమోదు చేశామన్నారు. డీఎస్పీ సి.వి జయభాస్కరరావు పర్యవేక్షణలో రూరల్ సీఐ భక్తవత్సలరెడ్డి, రొంపిచర్ల ఎస్ఐ సురేష్, సిబ్బంది బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలింపు చేపట్టారన్నారు. అదే గ్రామానికి చెందిన పమ్మి వెంకటేశ్వరరెడ్డి, పూజల రాములు, గుంటూరు నల్లచెరువు ఏడవ లైనులో నివాసం ఉంటున్న నరసరావుపేట మండలం దొండపాడుకు చెందిన పులి అంజిరెడ్డి, ఫిరంగిపురం మండలం నుదురుపాడు గ్రామానికి చెందిన ఒంటిపులి వెంకటేశ్వర్లును అరెస్టు చేశామన్నారు. బాలకోటిరెడ్డికి అల్లుడు వరసయ్యే పమ్మి వెంకటేశ్వరరెడ్డి టీడీపీలో ఉంటూ గ్రామంలో జరిగే అన్ని కార్యక్రమాల్లో పాల్గొనేవాడన్నారు. భవిష్యత్తులో పార్టీలో ప్రముఖస్థానం అప్పగిస్తానని గత పంచాయతీ ఎన్నికలు, గ్రామంలో జరిగే ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్లకు సంబంధించి నిందితుడు వెంకటేశ్వరరెడ్డితో డబ్బులు ఎక్కువగా ఖర్చు చేయించాడన్నారు. అనంతరం నిందితుడిని పట్టించుకోకుండా పార్టీలో కూడా సరైన స్థానం ఇవ్వకుండా చేస్తుండటంతో బాలకోటిరెడ్డిపై వెంకటేశ్వరరెడ్డి కక్ష పెంచుకున్నాడని తెలిపారు. తనను పార్టీలో పైకిరాకుండా అణచివేస్తున్నాడనే భావనలో ఉంటూ బాలకోటిరెడ్డి బతికి ఉండగా తనకు పార్టీలో స్థానం ఉండదని, గుర్తింపు లభించదని భావించాడు. ఎలాగైనా బాలకోటిరెడ్డిని హతమార్చాలనే ఉద్దేశంతో గత ఏడాది జూలై 19వ తేదీ నిందితుడు వెంకటేశ్వరరెడ్డి దాడిచేసి చంపే ప్రయత్నం చేశాడని చెప్పారు. ఆ విషయమై రొంపిచర్ల పోలీసులు వెంకటేశ్వరరెడ్డిపై హత్యాయత్నం కేసు నమోదుచేసి జైలుకు పంపించారని తెలిపారు. జైలులో అంజిరెడ్డితో పరిచయం ఏర్పడిందని, అతనికి జరిగిన విషయాలు చెప్పి తనకు సహాయం చేయమని కోరినట్లుగా విచారణలో తేలిందన్నారు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత ఒక పథకం ప్రకారం అంజిరెడ్డి, వెంకటేశ్వర్లు, రాములు అనే వ్యక్తులతో బాలకోటిరెడ్డి ఇంటికి వెళ్లి అతన్ని బయటకు పిలిచి తమ వెంట తెచ్చుకున్న తుపాకీతో కాల్పులు జరిపారన్నారు. బుల్లెట్ నడుం కింది భాగంలో దూసుకెళ్లడంతో బాలకోటిరెడ్డి తీవ్ర గాయాలతో పడిపోయారని చెప్పారు. దీనిపై ఫిర్యాది బాలకోటిరెడ్డి నుంచి సేకరించిన సమాచారంతో నిందితులుగా ఉన్న నలుగురిని అరెస్ట్ చేసి, హత్యాయత్నానికి వాడిన తుపాకీని స్వాధీనం చేసుకున్నామని వివరించారు. తుపాకిని రాజస్థాన్ నుంచి సేకరించారని, ఆ వివరాలను కేసు ఛేదన దృష్ట్యా గోప్యంగా ఉంచామన్నారు. కేసును వెంటనే ఛేదించిన సీఐ, ఎస్ఐ, సిబ్బందిని అభినందించారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) ఎ.బిందుమాధవ్, డీఎస్పీ విజయభాస్కర్‌రావు, రూరల్ సీఐ భక్తవత్సలరెడ్డి, రొంపిచర్ల ఎస్ఐ రమేష్, రూరల్ ఎస్ఐలు బలనాగిరెడ్డి, హాజరత్తయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభా పరీక్షకు వేళాయె!

- ఈ నెల 5న ఎన్ఎంఎంఎస్ పరీక్ష
- పల్నాడు జిల్లాలో 14 కేంద్రాలు
- జిల్లా వ్యాప్తంగా హాజరుకానున్న 3,384 మంది విద్యార్థులు



ఫణిదం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులు

సత్తెనపల్లి: పేద ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆర్థిక చేయూతనందించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న నేషనల్ మీన్స్ అండ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు సమయం సమీపిస్తోంది. ప్రతిభ ఉండి ఆర్థిక స్థోమత లేక ఎందరో విద్యార్థులు ముఖ్యంగా విద్యార్థినులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. పాఠశాల విద్యను పూర్తిచేసినా ఇంటర్మీడియెట్‌కు వచ్చేసరికి వివిధ కారణాల వల్ల ముఖ్యంగా ఆర్థిక లేమితో చదువుకు ఫుల్‌స్టాప్ పెట్టేస్తున్నారు. దీనిని గమనించిన కేంద్ర ప్రభుత్వం జాతీయ ప్రతిభాన్వేషణ పరీక్ష (ఎన్ఎంఎంఎస్)ను అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఎనిమిదవ తరగతి చదువుతున్న విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసే విధంగా పరీక్ష నిర్వహించి, ఆ పరీక్షలో ప్రతిభను చాటిన విద్యార్థులకు తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ పూర్తి చేసే వరకు ఆర్థిక సాయం అందజేస్తుంది. ఏడాదికి రూ.12 వేల చొప్పున నాలుగేళ్లలో రూ.48 వేలు ప్రోత్సాహం అందిస్తున్నారు. ఈ ఏడాది పల్నాడు జిల్లా వ్యాప్తంగా 3,384 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నట్లు విద్యాశాఖ అధికారుల గణాంకాలు తెలుపుతున్నాయి. మరింత మంది విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక కావాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులకు ఉపాధ్యాయులు గత నాలుగు నెలలుగా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు..

పల్నాడు జిల్లా వ్యాప్తంగా ప్రతిభాన్వేషణ పరీక్ష ఈ నెల 5వ తేదీ నిర్వహించనున్నారు. దీనికిగాను 14 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. సత్తెనపల్లిలో నాలుగు పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశారు. సత్తెనపల్లి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, జిల్లా పరిషత్ సుగాలి కాలనీ ఉన్నత పాఠశాల, శ్రీసరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాల, శ్రీరాఘవేంద్ర బాలకుటీర్ పాఠశాలను పరీక్షా కేంద్రాలుగా ఎంపిక చేశారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లను చేపడుతున్నారు.

పోటీతత్వాన్ని పెంపొందిస్తుంది



ప్రతిభాన్వేషణ పరీక్ష గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు ఓ వరం. విద్యార్థుల్లో పోటీతత్వాన్ని ఈ పరీక్ష పెంపొందిస్తుంది. ఈ పరీక్షలో ప్రతిభ చూపితే వరుసగా నాలుగేళ్ల పాటు ఉపకార వేతనం పొందుతారు. ప్రతి పాఠశాల నుంచి ఈ పరీక్షలో రాణించేలా విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు.

– వి.వెంకటేశ్వరరావు, డీవైఈవో, సత్తెనపల్లి

26న గుంటూరులో డాగ్ షో

- దరఖాస్తులకు ఆహ్వానం
- వాల్‌పోస్టర్లను ఆవిష్కరించిన ఐజీ త్రివిక్రమవర్మ

నగరంపాలెం(గుంటూరు): గుంటూరు కినల్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీ గుంటూరులోని శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో 'డాగ్ షో' నిర్వహించనున్నట్లు క్లబ్ గౌరవాధ్యక్షుడు, గుంటూరు రేంజ్ ఐజీ డాక్టర్ సీఎం త్రివిక్రమవర్మ తెలిపారు. గుంటూరులోని రేంజ్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఐజీ మాట్లాడారు. ఉదయం 9 గంటలకు షో ప్రారంభమవుతుందని తెలిపారు. క్లబ్ అధ్యక్షుడు పి.రామచంద్రరాజు మాట్లాడుతూ ఆల్ బ్రీడ్ చాంపియన్‌షిప్-డాగ్ షో ప్రవేశ రుసుం రూ.500, ముగ్గురికి కూపన్లు అందిస్తామన్నారు. శునకాల కిట్‌ను కూడా పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. ఆదేరోజు సాయంత్రం 6 గంటలకు శునకాలతో ప్రత్యేక ప్రదర్శన (డాగ్ షో) ఉంటుందని చెప్పారు. కుక్కలకు అవసరమైన చికిత్సా విధానం, పెట్ దుకాణాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. బహుమతుల ప్రదానోత్సవం జరుగుతుందని చెప్పారు. ఈ నెల 24లోగా దరఖాస్తులు అందించాలని తెలిపారు. వివరాల కోసం 97047 93194, 77021 53243 సెల్ నంబర్లలో సంప్రదించాలని కార్యదర్శి ఎస్‌వీఎస్ లక్ష్మీనారాయణ తెలిపారు. అనంతరం డాగ్ షోకు సంబంధించి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

భూముల రీసర్వేకు ప్రజల మద్దతు

గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జేసీ రాజకుమారి

గుంటూరువెస్ట్: భూముల రీ సర్వేకు ప్రజలు, రైతుల నుంచి మంచి స్పందన వస్తుందని అందుకే కార్యక్రమం విజయవంతంగా నడుస్తుందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధానకార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి నిర్వహించిన వీడియో సమావేశానికి స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్, జేసీ రాజకుమారి, డీఆర్వో చంద్రశేఖరరావు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు జరిగిన రీసర్వే సంతృప్తికరంగా ఉందన్నారు. గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న ల్యాండ్ కన్వర్షన్స్ చాలా వరకు క్లియర్ చేశామన్నారు. రబీతో పాటు తుంపర, బిందు సేద్యం కూడా విస్తరణకు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. జగనన్న ఇళ్ల పథకంలో భాగంగా ఉగాదికి వీలైనన్ని గృహాలు ప్రారంభిస్తామని చెప్పారు.

రేపటి నుంచి సీఎం కప్ ఫుట్‌బాల్ పోటీలు

గుంటూరువెస్ట్(క్రీడలు): శాప్ ఆదేశాల మేరకు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9 గంటలకు సీఎం కప్ జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీలు నిర్వహిస్తామని స్టెప్ సీఈఓ ఎస్.పల్లవి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరచిన వారిని ఈనెల 22 నుంచి 26 వరకు తిరుపతిలో జరగనున్న రాష్ట్ర పోటీలకు పంపిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు కె.పాల్‌కుమార్ (సెల్ నెంబర్ 92906 67994)ను సంప్రదించాలన్నారు.

రక్షకుడిని లోకానికి అందించిన మరియమాత

● క్రీస్తును ఆరాధిస్తూ పవిత్రంగా జీవించాలి ● పరిపూర్ణ విశ్వాసంతో ప్రార్థిస్తే కష్టాలు దూరం ● కార్డినల్, హైదరాబాద్ ఆర్చిబిషప్ పూల అంథోని

173వ తిరునాళ్ల మహోత్సవం ముగింపు సందర్భంగా సమష్టి దివ్యపూజాబలి



పండుగ సమష్టి మహోత్సవ దివ్యపూజాబలిని సమర్పిస్తున్న కార్డినల్, హైదరాబాద్ ఆర్చి బిషప్ పూల అంథోని, ఫాదర్లు

రెంటచింతల: పవిత్ర కన్యమరియ తల్లి తన తొలిచూలు కుమారుడైన ప్రభువైన ఏసుక్రీస్తును సమస్త మానవాళిని రక్షించుటకై దేవాలయంలో దేవునికి సమర్పించినట్లు కార్డినల్, హైదరాబాద్ ఆర్చిబిషప్ పూల అంథోని అన్నారు. స్థానిక కానుకమాత చర్చి విచారణ గురువులు ఫాదర్ ఏరువ లూర్దుమర్రెడ్డి నేతృత్వంలో 173వ తిరునాళ్ల మహోత్సవం ముగింపు సందర్భంగా గురువారం ఉదయం చర్చి ఆవరణలో నిర్వహించిన పండుగ మహోత్సవ సమష్టి దివ్యపూజాబలిలో భక్తులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. కథోలికులు క్రీస్తు సూక్తులను ఆచరిస్తూ, ఆరాధిస్తూ ఇతరుల పట్ల ప్రేమ, దయ, కరుణ చూపుతూ జీవించాలని అన్నారు. పరిపూర్ణమైన హృదయం కలిగి విశ్వాసంతో ప్రార్థిస్తే కష్టనష్టాలు తొలిగి పోతాయన్నారు. సమాజంలో నెలకొన్న అశాంతి తొలిగిపోవాలంటే ప్రభువు చూపిన బాటలో నడవాలన్నారు. ప్రస్తుత సమాజంలో నెలకొన్న సమస్యలకు శాంతి సమాధానాలే పరిష్కార మార్గాలని అన్నారు. పవిత్ర బైబిల్ గ్రంథం ద్వారా ఓపిక, విశ్వాసంతో జ్ఞానస్థానం పొంది దేవుని బిడ్డలంగా జీవిస్తూ ఉండాలన్నారు. నేను ద్రాక్షావల్లిని మీరందరూ నా తీగెలు అని.. నాయందు ఉండు ప్రతి తీగెను నేను ఫలింపచేయునని ప్రభువువైన క్రీస్తు పలికినట్లు తెలిపారు. కులమాతాలకు అతీతంగా వేలాది మంది భక్తులు ఈ దివ్యపూజాబలిలో పాల్గొని కానుకమాత ఆశీస్సులు పొందారు. విచారణ గురువులు యేరువ లూర్దుమర్రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ పండుగ మహోత్సవ దివ్యపూజాబలిలో 60 మంది గురువులు, 30 మంది మఠకన్యలు, భక్తులు పాల్గొన్నారు. అనంతర పూల అంథోనిని ఫాదర్లు, చర్చిపెద్దలు ఘనంగా సన్మానించారు. ముందుగా ప్రత్యేక వాహనంపై కార్డినల్, హైదరాబాదు ఆర్చిబిషప్ పూల అంథోనిని మేళతాళాలతో, భారీగా బాణాసంచా కాలుస్తూ ఊరేగింపుగా భక్తులు దేవాలయం వరకు తీసుకువచ్చారు. సాయంత్రం 3గంటలనుంచి వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వేలాదిమంది భక్తులు కరుణకల్గిన కానుకమాతకు కొవ్వొత్తులను సమర్పించి తమతమ మొక్కులను చెల్లించుకున్నారు. ఎస్ఐ సయ్యద్ షమీర్‌బాషా నేతృత్వంలో పెద్ద సంఖ్యలో పోలీసులు బందోబస్తును పర్యవేక్షించారు.

కరుణామయురాలు కానుకమాత : ప్రభుత్వ విప్ పిన్నెల్లి



కానుకమాత చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

రెంటచింతల: కరుణామయురాలైన కానుకమాత చల్లని దీవెనలతో రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం నిర్వహించిన స్థానిక కానుకమాత చర్చి 173వ మహోత్సవ ముగింపు వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని దేవాలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బ్రదర్ అనీల్ ప్రభుత్వ విప్ పీఆర్కేకు ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పీఆర్కే మాట్లాడుతూ ఎంతో పవిత్రత కల్గిన మరియతల్లి తన కుమారుడైన ఏసుక్రీస్తును లోకరక్షణ కోసం దేవునికి కానుకగా అర్పించిన కరుణగల్గిన తల్లిగా కొనియాడబడుతుందన్నారు. పల్నాడు ప్రాంత ప్రజలు శాంతి, సమాదానాలతో జీవించాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఆయనవెంట ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, వైస్ ఎంపీపీ ఏరువ శౌర్రెడ్డి, సర్పంచి పూజల పుష్పావతి రామయ్య, వైస్ సర్పంచి ఏరువ ప్రమీలా విజయ భాస్కర్ రెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్ మద్దిరాల కృష్ణారెడ్డి, సొసైటీ చైర్మన్ మోదుగు శ్రీనివాసరెడ్డి, దుర్గి మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ ఆదూరి ఇన్నారెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచి అల్లం ప్రతాప్‌రెడ్డి, పార్టీ నాయకులు తుమ్మా ఇన్నారెడ్డి, కట్టమూరి శ్రీనివాసరావు తదితరులున్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన టిప్పర్

● ఒకరు మృతి, మరొకరి పరిస్థితి విషమం
● నిశ్చితార్థానికి కేక్ తెచ్చేందుకు వెళ్తుండగా ఘటన



ప్రమాదంలో దుర్మరణం చెందిన వినయ్



సంఘటనలో విషమంగా ఉన్న శివభద్రినాథ్

మేడికొండూరు: వారు ఇద్దరు చిన్నప్పటి నుంచి మంచి స్నేహితులు, ఒకే కుటుంబానికి చెందిన బావ, బావమరుదులు ఇంజినీరింగ్ చదుతున్నారు. మరికొద్ది గంటల్లో జరగనున్న తమ బంధువుల అమ్మాయి నిశ్చితార్థ వేడుకకు అవసరమైన కేక్ తీసుకొచ్చేందుకు వెళ్తుండగా మృత్యువు టిప్పర్ లారీ రూపంలో కబళించింది. ఫలితంగా ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన మేడికొండూరు మండలం పేరేచర్ల సత్తెనపల్లి రోడ్డులోని గుంటూరు బ్రాంచ్ కెనాల్ వద్ద గురువారం జరిగింది. మేడికొండూరు మండలం పొట్లపాడుకు చెందిన పి.వినయ్ చేబ్రోలు ఇంజినీరింగ్ కాలేజీలో చివరి సంవత్సరం చదువుతున్నాడు. అతని మేనత్త కొడుకు సత్తెనపల్లికి చెందిన జెట్టి శివభద్రినాథ్ మేడికొండూరు విశదల అడ్డరోడ్డు వద్ద గల ఎన్నారై ఇంజినీరింగ్ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఇద్దరికి దగ్గర బంధువు అయిన అమ్మాయికి నిశ్చితార్థం పొట్లపాడు గ్రామంలో జరగనుండటంతో వారిరువురు కళాశాలకు సెలవు పెట్టి ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. వేడుకకు కేక్ అవసరం పడింది. కేక్ తెచ్చేందుకు వారిద్దరూ పేరేచర్లకు ద్విచక్రవాహనంపై బయలుదేరారు. మార్గంమధ్యలో పేరేచర్ల కాలువ వంతెన వద్ద మట్టి లోడుతో లారీ వేగంగా వస్తూ ఎలాంటి ముందస్తు సిగ్నల్ వేయకుండా సడన్‌గా కుడి కాలుకట్ట వైపుకు తిప్పాడు. వేగనియంత్రణ కోల్పోయిన టిప్పర్ ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ద్విచక్రవాహనం లారీ వెనుక చక్రాల కింద పడిపోయింది. కింద పడిపోయిన వినయ్(20)ను లారీ కొంతదూరం ఈడ్చుకెళ్లింది. దీంతో అతని శరీరం రెండు భాగాలుగా విడిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శివ భద్రినాథ్‌కు అధిక రక్తస్రావం జరిగి ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. సమాచారం తెలుసుకుని అక్కడకు చేరుకున్న మేడికొండూరు సీఐ అల్తాఫ్ హుస్సేన్ తీవ్రంగా గాయపడిన శివను వైద్యం నిమిత్తం ఆటోలో గుంటూరు ఆసుపత్రికి తరలించారు. అదే మార్గాన వెళ్తున్న మేడికొండూరు తహసీల్దార్ జి కరుణకుమార్ ప్రమాద సంఘటనను పరిశీలించారు. ప్రమాద విషయం తెలుసుకున్న ఇరువురు కుటుంబీకులు అక్కడకు చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. కొద్ది నెలలలో ఇంజినీరింగ్ చదువు పూర్తి చేసుకొని మంచి ఉద్యోగం సంపాదించి కుటుంబానికి అండగా ఉంటావని కన్న కలలు ఆవిరి చేశావా అంటు వినయ్ మృతదేహంపై పడి తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు చూపరులను కలచి వేసింది. మేడికొండూరు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు చంద్రిక ఎంపిక



చంద్రిక, ప్రతిమలకు కప్ అందజేస్తున్న రమేష్, రాజారెడ్డి, తదితరులు

తెనాలిఅర్బన్: ఎస్‌జీఎఫ్ఐ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన అండర్–17 బాలికల వాలీబాల్ పోటీల్లో గుంటూరు జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచిందని స్కూల్ హెచ్‌ఎం కె.రాజారెడ్డి, పీడీ జె.రమేష్ తెలిపారు. జట్టులో తెనాలి చెంచుపేటలోని కొంగంటి శివయ్య మున్సిపల్ హైస్కూల్ విద్యార్థినిలు వై.చంద్రిక, కె.ప్రతిమ పాల్గొని మంచి ప్రతిభ చూపించారని చెప్పారు. వై.చంద్రిక జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించిందన్నారు. వీరిని గురువారం పాఠశాల ఆవరణలో అభినందించి కప్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెలగా సుభాష్‌చంద్రబోస్, ఈ.అంబారీషుడు, డి.శ్రీనివాసరావు, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

సేవలు సమర్థంగా అందించాలి

● సచివాలయ సిబ్బందికి ప్రిన్సిపల్ సెక్రటరీ సునీత సూచన
● యర్రబాలెంలో ఆకస్మిక తనిఖీ



అడిషనల్ కమిషనర్ హేమమాలినితో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సెక్రటరీ కె సుజాత

మంగళగిరి: సచివాలయ ఉద్యోగులు వలంటీర్లతో మమేకమై ప్రజలకు సమర్థవంతంగా సేవలు అందించాలని హ్యాండ్‌లూమ్స్, టెక్స్‌టైల్స్ ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.సునీత అన్నారు. మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని యర్రబాలెం 3వ సచివాలయాన్ని గురువారం ఆమె ఆకస్మికంగా సందర్శించి రికార్డులు తనిఖీ చేసి అటెండెన్స్ పరిశీలించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవలు అందించాలన్నారు. సచివాలయ ఉద్యోగులు నిబద్ధతతో తమ ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తించాలని, సర్వీసెస్‌కు సంబంధించి రెమిటెన్స్ అమౌంట్ ఏ రోజుకు ఆ రోజు క్లియర్ చేసి బ్యాంకులో డిపాజిట్ చేయాలని సూచించారు. సచివాలయంలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమం తప్పనిసరిగా నిర్వహించి ప్రజా సమస్యలను తెలుసుకోవడంతో పాటు సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. సెక్రటరీలు వార్డుల్లో సర్వేలు సక్రమంగా నిర్వహించడంతో పాటు వలంటీర్లను సమన్వయపర్చుకుని ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా యూనిఫాం ధరించి విధులకు హాజరుకావాలన్నారు. విధి నిర్వహణలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు రావాలని, తద్వారా సమస్యల సత్వర పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ హేమమాలినితో పాటు పలువురు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సోలార్ పవర్ జనరేషన్ ప్లాంట్ ప్రారంభం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, వీసీ ఆచార్య పి.రాజశేఖర్

ఏఎన్‌యూ: నెడ్‌క్యాప్ ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన 2 మెగావాట్స్ రూఫ్ టాప్ సోలార్ జనరేషన్ ప్లాంట్‌ను గురువారం కలెక్టర్ ఎం వేణుగోపాల్‌రెడ్డి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టర్ కార్యాలయంలో కూడా 80 కేవీ సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయడం వల్ల విద్యుత్ ఛార్జీలు చాలా ఆదా అయ్యాయన్నారు. ఇలాంటి నాన్ కన్వెన్షనల్ ఎనర్జీ వినియోగం వల్ల ఖర్చుతోపాటు కాలుష్యాన్ని కూడా నివారించవచ్చన్నారు. ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి రాజశేఖర్ ప్రసంగిస్తూ ఏఎన్‌యూకి న్యూఢిల్లీకి చెందిన ఆర్ఈసీ (రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్) సంస్థ సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను మంజూరు చేయడం అభినందనీయమన్నారు. నెడ్‌క్యాప్ సంస్థ ఆ ప్లాంట్ ఏర్పాటు పనులు, నిర్వహణ చేపట్టిందన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి కరుణ, ప్రిన్సిపాల్స్ ఆచార్య గంగాధర్, ఆచార్య స్వరూపరాణి, ఆచార్య సిద్దయ్య, ఓఎస్‌డీ ఆచార్య సునీత, డీఈఈ ఎన్ వెంకటేశ్వరరావు, నెడ్‌క్యాప్ జిల్లా మేనేజర్ వి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్‌లో దూరవిద్య టెన్త్, ఇంటర్ పరీక్షలు

గుంటూరుఎడ్యుకేషన్: ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ (ఏపీఓఎస్ఎస్) ఆధ్వర్యంలో దూరవిద్య టెన్త్, ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ఏప్రిల్ 3వ తేదీ నుంచి 17 వరకు జరగనున్నట్లు సంస్థ డైరెక్టర్ కేవీ శ్రీనివాసులురెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ ప్రాక్టికల్స్ ఏప్రిల్ 18 నుంచి 23 వరకు జరుగుతాయని తెలిపారు. ఆయా పరీక్షలకు హాజరు కానున్న అభ్యర్థులు ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి ఫిబ్రవరి 15లోపు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఏపీ ఆన్‌లైన్ కేంద్రంతోపాటు ఆన్‌లైన్ పేమెంట్ గేట్‌వే ద్వారా పరీక్ష ఫీజు చెల్లించాలని సూచించారు. పరీక్షల టైం టేబుల్, పరీక్ష ఫీజు చెల్లింపు షెడ్యూల్‌ను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఓపెన్‌స్కూల్.ఏపీ.జీవోవీ.ఇన్ సైట్‌ను సందర్శించాలని తెలిపారు.

12న బీపీ మండల్ విగ్రహావిష్కరణ

● బీసీల ఆత్మగౌరవ సభ
● రాజ్యసభ సభ్యుడు బీదా మస్తానరావు
● బీసీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తుంది
● ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రాజ్యసభ సభ్యుడు బీద మస్తానరావు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, తదితరులు

గుంటూరు రూరల్: దేశంలో బీపీ మండల్ నివేదికలను అమలు చేసి బీసీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలని రాజ్యసభ సభ్యుడు బీదా మస్తానరావు తెలిపారు. గురువారం నగర శివారుల్లోని ఇన్నర్ రింగ్ రోడ్డు నందు బీపీ మండల్ విగ్రహావిష్కరణ కమిటీ ఆధ్వర్యంలో బీసీల ఆత్మగౌరవ సభ, బీపీ మండల్ విగ్రహ విష్కరణ వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 72 కోట్ల మంది బీసీలు ఉన్నారని కానీ కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖలేదని చెప్పారు. బీపీ మండల్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని బీసీలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు కల్పించాలని కేంద్రానికి విన్నవించారు. అదేవిధంగా బీపీ మండల్ సిఫారసులు మేరకు మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, జనగణన చేపట్టాలని కోరారు. ఈ నెల 12వ తేదీన నగర శివారుల్లోని అమరావతి రోడ్డు ఇన్నర్ రింగ్‌రోడ్డు చిల్లీస్ సెంటర్‌లో ప్రతిష్ఠించనున్న బీపీ మండల్ విగ్రహ విష్కరణ, బీసీల ఆత్మగౌరవ సభను ప్రతి ఒక్కరూ జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ ఆర్థికంగా సామాజికంగా ఆర్థిక రుగ్మతలను అసమానతలు తొలగించడానికి బీసీల ఆత్మగౌరవ సభను నిర్వహిస్తున్నారన్నారు. బీసీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. బీసీ కమిషన్‌లో ఉన్న సంస్కరణలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో బోనబోయిన శ్రీనివాస్, కేశన శంకరరావు, ఆలా వెంకటేశ్వరరావు, క్రాంతికుమార్, గోళ్ళ శివశంకర్, తాళ్ళ వీరయ్య, పలు బీసీ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునదేమనగా నా క్లయింట్ అయిన Singh Ahmed Linga Babu S/o Ankamma Chowdary ఆర్థికంగా వ్యాపారంలో నష్టాలు వచ్చి దివాళ తీయుచున్నారు. కోర్టు 12.08.2022న IP Notice లు పంపించి ఉన్నారు. నా క్లయింటు IP Case Courtలో file చేసి స్టేషనరీ హాజ లేకపోవటం వలన, ఆ లేటుకి IP Noticeలు పంపటము మాత్రమే జరిగి ఉన్నది. నా క్లయింటు తేదీన రుణదాతలుగా వ్యవహరించిన వారికి Axis Bank Non MICR Branch, Chilakaluripeta నుండి Cheque No. 001842 నుండి 001848 వరకు మరియు 001851 నుండి 001856 వరకు మరియు 054938, 054942 నుండి 054946 వరకు మరియు 054968, 054854, 054957, 054958, 054867 to 054872, 054891 to 054897, 054899, 054901 to 054906, 054911, 054913 to 154915, 054918, 054923, 054927, 054930, 054931, 054932, 49334 Chequeలు security ఇచ్చియున్నారు. పై తెలిపిన IP Noticeలో నా క్లయింట్ తన అకౌంట్లో డబ్బులు లేవని మరియు పై తెలిపిన Cheque లు అన్ని Stop చేసామని తెలిపి యున్నారు. [illegible] నా క్లయింటుని [illegible] నా క్లయింట్ యొక్క చెక్కులు వారి పేరు మీద వారి [illegible] పెడుతున్నారు. అది చట్టపరంగా నేరమని తెలుపుతున్నాము. అదే విధంగా నా క్లయింట్ ఇచ్చిన వారి Pro note లు కూడా వాడుకున్నారని తెలిసింది. కావున యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునదేమనగా పై తెలిపిన Cheque లను మరియు నా క్లయింటుకి సంబంధించిన వేరే ఇతర Chequeలను, నా క్లయింటు సంబంధించిన ఇతర Pro note లను నా క్లయింట్ ఆర్థికంగా [illegible] పై చట్టపరమైన చర్యలు తీసుకోబడునని తెలియజేయుచున్నాను.

పంగుల్ల గోపి, అడ్వకేట్, అన్నపూర్ణనగర్, గోరంట్ల, గుంటూరు. సెల్ : 9885402037